# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-09-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఉపరాష్ట్రపతి ఎన్నికకు జరుగుతున్న పోలింగ్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

2. ఆరోగ్య సంరక్షణ, వైద్యవిద్యలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

3. అనంతపురంలో రేపు సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభను నిర్వహించనున్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.

4 రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఏక గవాక్ష పద్ధతిలో అనుమతులు ఇస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు.

5. ప్రపంచ విద్యుత్ వాహనాల అవగాహనా దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు.

==========================

ఉపరాష్ట్రపతి ఎన్నికకు పోలింగ్ కొనసాగుతోంది. ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ఈ ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.అలాగే కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్, జితేంద్ర సింగ్, ప్రహ్లాద్ జోషి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలు ఓటు వేశారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు జరగనుంది. ఎన్నికలో ఎన్డీఏ అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థిగా బి. సుదర్శన్ రెడ్డి పోటీ చేస్తున్నారు.

--------------------------

ఆరోగ్య సంరక్షణ, వైద్యవిద్యలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 27వ మరియు 28వ స్నాతకోత్సవంలో గవర్నర్ ఈరోజు పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థులకు ధ్రువ పత్రాలను పతకాలను అందజేశారు అనంతరం గవర్నర్ ప్రసంగిస్తూ,

వాయిస్ 28 సెకెన్లు

--------------------------

రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రులు కీలక పాత్ర పోషించాలని ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. స్విజర్లాండ్ పర్యటనలో భాగంగా జ్యూరిచ్‌లోని తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్విజర్లాండ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సృజనాత్మక ఆలోచనలతో తమ స్వగ్రామాలలో సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ప్రవాసాంధ్రులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించవచ్చని తెలిపారు.

------------------------------

అనంతపురంలో రేపు సూపర్ సిక్స్–సూపర్ హిట్ విజయోత్సవ సభను నిర్వహించనున్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురం లో విజయోత్సవ సభ ఏర్పాట్లను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ లతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ,

వాయిస్ 27 సెకన్లు

------------------------------

కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో 6 వేల కోట్ల రూపాయలతో త్వరలో మరో పరిశ్రమ ఏర్పాటుకానుందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. కర్నూలులో 'సులభతర వాణిజ్యం'పై నిన్న నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ, పరిశ్రమల శాఖ నుంచి రావాల్సిన అనుమతులు, ఏక గవాక్ష పద్ధతిలో ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులకు అనుమతులు వేగంగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన రాయితీలను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

------------------------------

ప్రపంచ విద్యుత్ వాహనాల అవగాహనా దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, వాయు కాలుష్య నివారణ పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి ఏటా సెప్టెంబర్ 9వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. శిలాజ ఇంధనాల వాడకం వల్ల తీవ్ర వాతావరణ కాలుష్యం ఏర్పడడమే కాకుండా... పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వాహనాల వాడకాన్ని కేంద్ర ప్రభుత్వం ఫేమ్ ఇండియా పథకం కింద ప్రోత్సహిస్తోంది.

------------------------------

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోట నుండి వస్తు, సేవల పన్ను- జీఎస్టీలో కొత్త సంస్కరణలు ఉంటాయని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈనెల 3 వ తేదీన, దేశ ప్రజలకు ప్రయోజనం కలిగించేలా జీఎస్టీ మండలి స్లాబ్ ల హేతుబద్ధీకరణను ఆమోదించింది. ఇందులో భాగంగా ఈ రోజు జీఎస్టీ సంస్కరణల ద్వారా సౌందర్య సాధనాల రంగానికి కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

వాయిస్ 38 ఓవర్

------------------------------

సరళీకృత వస్తు, సేవల పన్ను –జీఎస్టీతో అందరికీ ప్రయోజనం చేకూరుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తెలిపారు. విశాఖపట్నంలో ఈ రోజు ఆయన మాట్లాడుతూ, మధ్యతరగతి, చిన్న వ్యాపారులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీఎస్టీ సంస్కరణలపై గొప్ప నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. సరళీకృత జీఎస్టీని స్వాగతిస్తూ ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రతి మండలంలో సదస్సులను నిర్వహించనున్నామని తెలిపారు.

---------------------------

పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు “విజయవాడ ఉత్సవ్ “ ను నిర్వహిస్తున్నామని విజయవాడ తూర్పు శాసనసభ సభ్యులు గద్దె రామ్మోహన్ తెలిపారు. విజయవాడ రాణిగారితోటలో ఆయన ఈ రోజు పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ, విజయవాడ ఉత్సవ్‌ను దసరా సమయంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమయంలో భక్తులు, పర్యాటకులు విజయవాడకు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలో పర్యాటకం అభివృద్ధి చెందుతుందని తద్వారా ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

---------------------------

ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. హెచ్ఐవి/ఎయిడ్స్, మాదకద్రవ్య దుర్వినియోగం పట్ల యువతలో అవగాహన పెంపొందించేందుకు యూత్ ఫెస్ట్–2025లో భాగంగా మారథాన్ 5కే రెడ్ రన్ కార్యక్రమంలో కలెక్టర్ ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనలో చికిత్స కన్నా నివారణే మార్గమని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

దక్షిణ ఒడిషా, ఉత్తరాంధ్ర తీరాలకు ఆనుకొని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ…

వాయిస్..26 సెకన్లు

---------------------------

రాష్ట్రం నుండి షిర్డీకి వెళ్లేవారి కోసం తిరుపతి–షిర్డీ మధ్య రోజూ రైలు నడపనున్నామని రైల్వే శాఖ తెలిపింది. ఇప్పటి వరకు తాత్కాలికంగా నడిచే ఈ రైలును రోజువారీ రైలుగా మార్పు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. తిరుపతి–షిర్డీ మధ్య 07637–07638 నంబర్ కలిగిన రైలును ఇకపై రోజూ నడపనున్నట్లు వెల్లడించింది. ఈ రైలు.. రేణిగుంట, ధర్మవరం, రాయచూర్, షోలాపూర్, దౌండ్ మీదుగా రాకపోకలు సాగించనుంది. తిరుపతి–షిర్డీ మధ్య రైలు నడపాలని ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయగా ఈ మేరకు ఆ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.

====================